W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

8-5-2025



## వైద్య విద్యార్థులకు మహర్దశ

- 35 ఎకరాలు ,166 కోట్లుతో భవనాల నిర్మాణం
- కార్పొరేట్ తరహా హంగులతో కొత్త భవనాలు
- నేడు మెడికల్ కళాశాలకు భవనాలకు శంకుస్థాపన

08



03

## ఆన్లైన్ బెట్టింగుల ఊబిలో చిక్కుకోవద్దు

సులభంగా డబ్బు వస్తుందని ఆన్లైన్ బెట్టింగులు, గేములు,పేకాట,స్టాక్ మార్కెట్ ట్రేడింగులకు అలవాటు పడి సంపాదనంతా పోయి ఎంతోమంది అప్పుల పాలవుతున్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేసారి కొంత మొత్తంలో డబ్బు రాగానే ఆన్లైన్ బెట్టింగ్, రమ్మి వంటి ఆటలు మంచి ఆదాయ మార్గమని యువత భావిస్తున్నారని అన్నారు.



05

## 9న జిల్లాకు రానున్న కేటీఆర్

**బీఆర్ఎస్ శ్రేణులకు సండ్ర వీరయ్య పిలుపు.**

ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత సైన్యం చేపట్టిన వైమానిక దాడులను బిఆర్ఎస్ పార్టీ గట్టిగా స్వాగతించింది.ఈ మేరకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ , మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు బుధవారం ఖమ్మం తెలంగాణ భవన్ నందు నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.




09

# కాంగ్రెస్‌తోనే పేదవారి సొంతింటి కల సాధ్యం

**మణుగూరులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఏజెన్సీ ప్రాంతంలో సుడిగాలి పర్యటన**



పదింటి వారి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పినపాక మండలం గొట్టెల్ల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందని రాష్ట్రంలో అమలుపరిచే సంక్షేమ పథకాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పించిందని పినపాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతగా అందించామని అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలియజేశారు. అనంతరం లబ్ధిదారి ఇర్ప లక్ష్మికి నూతన వస్త్రాలను అందజేసే శుభాకాంక్షలు తెలియచేసారు.

మణుగూరు, మహా



# 17.5 కేజీల గంజాయి పట్టివేత

## బజాజ్ పల్సర్ స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

**మహా భద్రాచలం:** ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా బజాజ్ పల్సర్ బండిలో గోదావరిఖని కి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా సమాచారం మేరకు, కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ భద్రాచలం లోని కూనవరం రోడ్డు లో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా గుర్తించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద ద్విచక్ర వాహనం (బజాజ్ పల్సర్) మరియు ఎండు గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. గంజాయి తూకం వేయగా 17.5 కేజీలు ఉన్నట్లు దాని విలువ 8.75 లక్షలుగా నిర్ధారించారు. ఈ తనిఖీల్లో ఎస్.ఐ గౌతమ్ సిబ్బంది రామకృష్ణ గౌడ్, హాబీబ్ పాషా, వెంకట నారాయణ, సుమంత్, శ్రావణి, పార్థసారథి, రమేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**ఖమ్మం - మహా:** మే -8 న నిర్వహించనున్న ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం, మంత్రుల పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేశారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన ఏర్పాట్లను ఆదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, మాతా శిశు సంరక్షణ కేంద్రం, జిల్లా ఆసుపత్రిని కలియతిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మే 8న జిల్లాలో వైద్యారోగ్యశాఖ



సంబంధించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించే ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలకు శంకుస్థాపన, పబ్లిక్ మీటింగ్ లో పాల్గొని, తర్వాత ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారని, వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై జిల్లా కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ వివరించారు. మంత్రుల సమీక్ష నేపథ్యంలో అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, సంబందించిన పూర్తి వివరాలతో హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, స్టాఫ్, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కిరణ్ కుమార్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, వైద్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెలో అందరూ పాల్గొనాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మే 7 (మహా):** మే 20వ తేదీన సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు , అన్ని విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొననున్నారని, ఈ సమ్మె సందర్భంగా కార్మిక వర్గం చేస్తున్న డిమాండ్ల పరిష్కారం కోసం వివిధ



సంస్థల యజమానులు సహకరించాలని కోరుతూ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నోటీసులను కాంట్రాక్టర్ లకు, సూపర్ వైజర్లకు సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మిక హక్కులను కాలరాస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. అనేక సంవత్సరాల నుండి కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం పోరాటాలు వల్ల కార్మిక చట్టాలను రూపొందించుకొని హక్కులు సాధించుకున్నామని వారన్నారు. ఆ హక్కులను మళ్లీ తిరగరాస్తూ 28 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా కుదించి కార్మిక హక్కులను హరించే వేసే విధంగా నేటి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వారన్నారు . ఒకవైపు ధరలు 400 శాతం పెరిగాయని అందుకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మిక వేతనాలు రోజు రోజుకు దిగజారిపోయి బానిస బతుకుల్లాగా తయారయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు శక్తి పడిపోయి బ్రతుకు బండి లాగ లేని స్థితికి దిగజారిన కార్మిక వర్గం ఒక్క తాటిపైకి వచ్చి మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మల్లెల రామనాథం,భూక్య రమేష్, పెద్దబోయిన సతీష్, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆటోమేటెడ్ మల్టీ-మోడల్ బయోమెట్రిక్ శిక్షణ

**ఖమ్మం - మహా:** ఆటోమేటెడ్ మల్టీ-మోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ అనేది నేరం జరిగిన ప్రదేశాల నుండి నేరస్థుల వేలిముద్రలు, అరచేతి ముద్రలు మరియు ఐరిస్ స్కాన్ డేటా ఆధారంగా నేరాలను గుర్తించడానికి ఒక అధునాతన నేర గుర్తింపు



వ్యవస్థ అని క్లూస్ టిమ్ ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందికి యొక్క సాంకేతికత పరిజ్ఞానాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకునేందుకు ఒకరోజు శిక్షణ తరగతులు పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. ఫింగర్–ఇంప్రెషన్ మరియు పామ్–ప్రింట్ ముద్రలను ఉపయోగించి నేరస్థులను గుర్తించడానికి తెలంగాణ పోలీసులు (ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్) ను ఉపయోగిస్తున్నారు. కొత్త క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) యాక్ట్, 2022 అమలులో భాగంగా, తెలంగాణ పోలీసులు తన సాంకేతికతను ఆటోమేటెడ్ మల్టీమోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (అంబిస్) కు అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. బయోమెట్రిక్ డేటా సేకరణ యొక్క పరిధిని విస్తరించి, ఇందులో ఐరిస్, ముఖం, పాద ముద్రలు, భౌతిక కొలతల నిల్వ (ఎత్తు మరియు బరువు), సంతకాలు మరియు చేతివ్రాతలు గుర్తించటం జరుగుతుంది.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**ఖమ్మం, మే -07 , మహా:** నెలవారి తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గల ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గోడౌన్ రూం సీల్ ను పరిశీలించి, భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీగా డ్యూటీలో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



# ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణి దీపాలు

## కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ఖమ్మం, మే -07:మహా:** ఆడపిల్లలు ఇంటికి వెలుగునిచ్చే మణి దీపాలని, ఆడపిల్లల సంరక్షణ భాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆడపిల్లలు పుట్టడం అదృష్టమని తెలుపుతూ, ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మా పాప – మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా రఘునాధపాలెం మండలం జింకలతండా గ్రామంలో బేగం కుటుంబ సభ్యులు, అంగన్వాడి టీచర్లు అందంగా ఇంటిని అలంకరించి ఆడపిల్లలను పుట్టనిద్దాం.. ఆడపిల్లలను పెరగనిద్దాం అనే నినాదాలతో ముగ్గులు వేసి కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. బేగం షరీఫ్ దంపతులకు 25 మార్చి, 2025న ఆడపిల్ల పుట్టిన విషయం తెలిసి, వారి ఇంటికి వచ్చిన జిల్లా కలెక్టర్, పాప తల్లిదండ్రులతో పాటు నాన్నమ్మ, తాతయ్య, అమ్మమ్మ లను కలిసి స్వీట్ బాక్స్, ఫ్రూట్స్, సర్టిఫికెట్ అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. చేతులతో పాపను ఎత్తుకొని లాలిస్తూ పాప చిరునవ్వుకు కలెక్టర్ మురిసిపోయారు. సమాజానికి ఆడపిల్లల ఆవశ్యకత ఏలాంటిదో వివరించారు. కలెక్టర్ ఆలోచనతో పాటు ఆచరణ పట్ల గ్రామస్థులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, రఘునాధపాలెం మండల తహసీల్దారు లూథర్ విల్సన్, ఎంపీడివో అశోక్ కుమార్, ఆర్ఐ ప్రవీణ్, ఆంగన్ వాడి టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ బెట్టింగుల ఊబిలో చిక్కుకోవద్దు

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం, మే 7 (మహా):** సులభంగా డబ్బు వస్తుందని ఆన్లైన్ బెట్టింగులు, గేములు,పేకాట,స్టాక్ మార్కెట్ ట్రేడింగులకు అలవాటు పడి సంపాదనంతా పోయి ఎంతోమంది అప్పుల పాలవుతున్నారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేసారి కొంత మొత్తంలో డబ్బు రాగానే ఆన్లైన్ బెట్టింగ్, రమ్మి వంటి ఆటలు మంచి ఆదాయ మార్గమని యువత భావిస్తున్నారని అన్నారు. మొదట్లో కొద్దిపాటి లాభాలు రాగానే కూర్చున్న చోటే పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఎంతోమంది ఆన్లైన్ బెట్టింగులు, గేములకు బానిసలుగా మారారని తెలిపారు. యువత మాత్రమే కాకుండా రిటైర్ అయిన ఉద్యోగులు, పెద్దవాళ్లు కూడా ఆన్లైన్ జూదం, గేమ్స్ బారినపడి అప్పుల ఊబిలో కూరుకుపోయి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు.అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని



తెలిపారు. ఆన్లైన్ గేములు ముందుగానే ప్రోగ్రామింగ్ చేసి ఉంటాయనే విషయాన్ని గ్రహించలేక అనేక మంది మోసపోయి తమ డబ్బులను పోగొట్టు కుంటున్నారని తెలిపారు. మనకు అవసరం ఉన్నా,లేకున్నా నిమిషాల్లోనే అప్పులు ఇస్తామంటూ వస్తున్న ఆన్లైన్ లోన్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సులువుగా తమ ఖాతాలోకి సొమ్ము వస్తుందని లోన్ యాప్ ల నుండి అప్పులు చేసి ఆన్లైన్ బెట్టింగుల్లో, జూదంలో పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని తెలిపారు. ఆన్లైన్ లోన్ యాప్ ల ద్వారా అప్పులు ఇచ్చే కంపెనీలు,అప్పు తీసుకున్న వారి వ్యక్తిగత వివరాలన్నీ సేకరించి వారి వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాయని తద్వారా అమాయకులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల దైనందిన కార్యకలాపాలను నిత్యం గమనిస్తూ ఉండాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. బెట్టింగ్ యాప్ లలో లాభాలు వస్తాయన్నది భ్రమ అని గ్రహించాలన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్ లు వాడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులపైనా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేసారు. ఎవరైనా ఆన్లైన్ ద్వారా గానీ,నేరుగా గానీ బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.

# వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ శాఖ సమీక్ష

**ఖమ్మం - మహా:** ఖమ్మం జిల్లా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఈ సమావేశాన్ని సూపరిండెంట్ ఇంజనీర్ శ్రీనివాసచారి మరియు జిల్లా నోడల్ ఆఫీసర్ నాగప్రసాద్ గారు ఆధ్వర్యం వహించారు. వేసవి కాలం కోసం అదనపు ట్రాన్స్ఫార్మర్లు మంజూరు, వాటి పనుల పురోగతి, 33 కెవి ఇంటర్‌లింకింగ్ పనులు, విద్యుత్ భద్రత వారోత్సవాల నిర్వహణ, 33 కెవి మరియు 11 కెవి లైన్ల మెయింటెనెన్స్ అంశాలపై సమీక్ష జరిగింది.ఈ సమావేశంలో టి బాబురావు, ఎం ఆర్ టి బద్రుపవర్, నంబూరి రామారావు (ఖమ్మం), నాగేశ్వరరావు (రూరల్), శ్రీనివాసరావు (వైరా), రాములు (సత్తుపల్లి), హీరాలాల్ (కన్స్ట్రక్షన్) తదితర డిఈలు, ఏడీలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తున్నాం

**కూసుమంచి, మే 7, మహా:** ఖమ్మం జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేశామని, అన్ని కేంద్రాలకు మిల్లులు, లారీలను ఏర్పాటు చేశామని, సరిపడిన బ్యాగులను అందించామని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జి. శ్రీలత తెలిపారు. బుధవారం కూసుమంచి మండలంలోని చేగొమ్మ, జీళ్లచెరువు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయిస్ డీఎం శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో కొనుగోలు కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉన్నయా అని అడిగి తెలుసుకున్నారు. బస్తాలు, లారీలను అవసరానికి అనుగుణంగా పంపిస్తామని తెలియజేశారు. తేమ శాతం రాగానే కాటాలు వేయించి కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని సెంట్రల్ ఇంచార్జ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాణి, ఏఈఓ రవీందర్ రైతులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి




**భద్రాద్రి కొత్తగూడెం, మే 7 (మహా):** కార్మిక వ్యతిరేక లేబర్ కోడులు రద్దు చేయాలని, విద్యుత్ సంస్థలను ప్రైవేటుకరించే 2020 నూతన విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20వ తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో విద్యుత్ రంగా ఉద్యోగులందరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఎన్పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బొల్లి వెంకటరాజు విజ్ఞప్తి చేశారు . బుధవారం ఎస్ ఇ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు . తెలంగారాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ యుఈఈయు– సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా పని చేసి మరణించిన అమరజీవి కిరణ్ ఆరో వర్ధంతి సభ సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించటమే కిరణ్ కి ఇచ్చే నివాళని పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మికుల పాలిట ఉరితాళ్ళుల్లోని విమర్శించారు .దేశవ్యాప్తంగా 2020 విద్యుత్ చట్టం రద్దు కోసం పంజాబ్ , ఉత్తరప్రదేశ్, గుజరాత్, కాశ్మీర్ తదితర రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు,కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించి విజయం సాధించారని అదే స్ఫూర్తితో కార్మిక హక్కులు కాలరాస్తున్న లేబర్ కోడులు రద్దు చేయాలని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, లేబర్ కోడుల అమలు కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమేనని నాయకులు విమర్శించారు. దేశ ప్రజల ప్రయోజనాలను, కార్మిక హక్కులను పణంగా పెట్టి కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల సేవలో తరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ సంస్థల వున్నందువలననే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సేవలు అందుతున్నాయని, లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్మటం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం బలహీన పరుస్తుందని విమర్శించారు. వర్ధంతి సభ మరియు ధర్నా కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కొలగాని రమేష్, జిల్లా అధ్యక్షులు కూను రాజు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాములు ,జిల్లా నాయకులు పదిలం శ్రీనివాస్ జి వెంకన్న, ఏడుకొండలు కనుకు సత్యనారాయణ , జిలాని తోకల శ్రీను ,వెంకటపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మెకానైజ్డ్ శుభ్రతకు ఖమ్మం నగరపాలక సంస్థ శ్రీకారం

**ఖమ్మం, మే 7:మహా:** నగర శుభ్రతను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఖమ్మం నగరపాలక సంస్థ ఆధునిక మెకానైజ్డ్ స్లీపింగ్ మిషన్‌ను సేవలోకి తీసుకొచ్చింది. పాత విధానాలకు స్వస్తి పలుకుతూ, కొత్త యాంత్రిక వ్యవస్థను ప్రవేశపెట్టిన పురపాలక సంస్థ, నగర నిర్మాణంలో కీలక మైలురాయిగా ఈ పద్ధతిని పేర్కొంది. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ స్లీపింగ్ మిషన్ రోజుకి సుమారు 60 కిలోమీటర్ల రహదారులను శుభ్రం చేయగలదు. మానవ శ్రమను గణనీయంగా తగ్గించడంతో పాటు, నగర శుభ్రత పనుల్లో వేగం, నాణ్యత సాధ్యమవుతుందని అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ సర్కిల్ నుండి బల్లేపల్లి స్టేజ్ వరకు నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తైంది. ఈ ప్రయోగాత్మక పరీక్ష ద్వారా మిషన్ సామర్థ్యాన్ని అవగతం చేసుకొని, త్వరలో నగరంలోని ఇతర ప్రధాన రహదారులపై దీన్ని అమలులోకి తేవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ, “ఖమ్మం ప్రజలకు పరిశుభ్రమైన జీవనవాతావరణం కల్పించేందుకు మెకానైజ్డ్ శుభ్రత పద్ధతి కీలకంగా నిలుస్తుంది. పౌరులకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలన్నదే మా లక్ష్యం,” అని తెలిపారు. యాంత్రిక శుభ్రత విధానాలు విశ్వసనీయత, వేగం, సమర్థత వంటి అంశాల్లో కీలకంగా నిలుస్తాయని, త్వరలో మరిన్ని మిషన్లను కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు

# తుమ్మల తీరు కాంగ్రెస్‌లో కలకలం

- పాత నేతల అవమానంపై మైనారిటీల ఆగ్రహం
- ఖమ్మం మీటింగ్‌లో మంత్రిపై తిరుగుబాటు
- హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తామని నేతల హెచ్చరిక

**ఖమ్మం - మహా:** తెలంగాణ రాజకీయ వేదికగా మారిన ఖమ్మం జిల్లాలో తాజాగా కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత ఉద్రిక్తతలు పుట్టుకొచ్చాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీరుపై జిల్లా స్థాయి నేతలు బహిరంగంగా తిరుగుబాటు చేస్తూ విమర్శల వర్షం కురిపించారు. మైనారిటీ వర్గాలకు పట్టించుకోకపోవడం, పార్టీకి ఎనలేని సేవలందించిన పాత నేతలను లెక్క చేయకపోవడం వల్లే ఈ అసహనం చెలరేగిందన్న భావన ప్రబలంగా వ్యక్తమవుతోంది. తుమ్మల మాటలు చెబుతారిగానీ, నేతల్ని నోచుకోరు అనే వాదన తెరపైకి వచ్చింది. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలని మైనారిటీ నేతలు నిశ్చయించడమే కాకుండా, తుమ్మల కారణంగా పార్టీకి నష్టం జరుగుతోందని తీవ్రంగా హెచ్చరించడం పార్టీ లోపల అంతర్యుద్ధానికే సంకేతంగా మారింది.

### తుమ్మలపై నేతల తిరుగుబాటుతో కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు.

ఖమ్మం నగరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం అర్థంలేని వివాదానికి వేదికైంది. మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు మాటలు చెప్పి వెళ్లిపోయిన తీరుపై మైనారిటీ వర్గాలకు చెందిన పాత కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "మాటలకే పరిమితం అవుతున్నాడు. మమ్మల్ని పిలిచి మాట్లాడటం లేదు. మేము పార్టీకి చేసిన సేవలకు కనీస గౌరవం చూపించడం లేదు," అని మైనారిటీ నాయకులు వేదికపైనే గళం విప్పారు. పార్టీకి సేవ చేసిన పాతవారి గొప్పతనాన్ని మరిచిపోవడమే కాదు, మతపరమైన సమూహాలకు ప్రాధాన్యత లేనట్లుగా వ్యవహరిస్తుండటం తుమ్మల రాజకీయ ధోరణిని ప్రశ్నించాల్సిన పరిస్థితి తీసుకొచ్చిందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. "ఇలాంటివారికి మంత్రి పదవి ఎలా దక్కుతుంది?" అని కొందరు నేతలు అనుకోకుండా వాఖ్యలు చేస్తూ మిగతా కార్యకర్తలను ఉద్దీపనకు గురిచేశారు.

### సభలోనే చిచ్చు... నేరుగా ఢిల్లీ దాకా వెళ్తాం!

ఈ పరిణామాల మధ్య మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. "తుమ్మల దృష్టికోణం పార్టీ విధానాలకు పూర్తి విరుద్ధంగా ఉంది. దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తాం. ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేస్తాం. నిబంధనలు, పద్ధతుల పరిరక్షణ కోసం మా గొంతు వినిపించక తప్పదు," అని మైనారిటీ నాయకులు తేల్చిచెప్పారు. పార్టీలోని సమైక్యతకు భంగం కలిగించేలా తుమ్మల వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పాత నాయకత్వాన్ని పట్టించుకోకపోవడం, కొత్త వారితో పార్టీని నడిపించే తీరుపై నిస్సహాయత వ్యక్తమవుతోంది. ఇది పూర్తిస్థాయి అంతర్గత విభేదాలకు దారితీస్తుందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ఖమ్మంలోనే స్థిరంగా కొనసాగుతున్న సీనియర్ నేతలు ఈ ఘటనపై బహిరంగ వ్యాఖ్యలు చేయకపోయినా, అంతర్గతంగా అసంతృప్తిని వ్యక్తపరిచినట్టు సమాచారం. "తుమ్మల ఒక్కరే మాట్లాడుతారు. మిగతా నేతల మాటలు వినడానికి ఆసక్తి చూపించరు. ఇది పార్టీ శ్రేయస్సుకే ప్రమాదం," అని పలువురు వాపోయారు. తుమ్మలపై ఈ విధంగా విభేదాలు వెల్లడి కావడం వల్ల ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ శిబిరం మరోసారి రాజకీయ తుపానుకు లోనయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మైనారిటీ వర్గాల అసంతృప్తి, పాత నేతల అవమాన భావన లాంటి అంశాలు ఇప్పటి దాకా మూలగా ఉన్న అగ్ని రేఖలు ఇప్పుడు మంటలు మళ్లుతున్నట్టుగా స్పష్టమవుతోంది.

### తుమ్మల ఎలా స్పందిస్తారన్నది కీలకం

ఇప్పుడు అందరి దృష్టీ తుమ్మల నాగేశ్వరరావు స్పందనపైనే నిలిచింది. ఆయన తనపై వచ్చిన విమర్శలపై ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారన్నదే పార్టీ పరిరక్షణలో కీలకంగా మారింది. ఒకవేళ ఆయన మౌనం పాటిస్తే లేదా బేఖాతరు ధోరణితో వ్యవహరిస్తే, ఈ అసంతృప్తి పార్టీలోని గుబురును మరింత పెంచే ప్రమాదం ఉంది. ఖమ్మం కాంగ్రెస్‌కి భవిష్యత్తులో ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్నదే ఆసక్తికర అంశంగా మారింది.



# ఆడబిడ్డ ఇంటికి మహాలక్ష్మి

**కూసుమంచి, మే 7, మహా:** ఆడబిడ్డ జన్మించడం అంటే ఆ ఇంట్లో మహాలక్ష్మి పుట్టినట్లేనని పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ జి. శ్రీలత అన్నారు. కూసుమంచి మండలం కేశ్వాపురం పంచాయతీ శివారు దేవుని తండాకు చెందిన వడ్తియా స్వాతి, నాగరాజు దంపతులకు ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈమేరకు జిల్లా కలెక్టర్ ముజ్మిలిఖాన్ ఆదేశానుసారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే "మా ఇంటి మణిదీపం" అనే కార్యక్రమం దేవుని తండ గ్రామంలో నిర్వహించారు.. ఆడపిల్లకు జన్మనిచ్చిన వడిత్య స్వాతి నాగరాజ దంపతులను తిరుమలాయపాలెం ప్రాజెక్టు సిడిపిఓ కవిత, జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీలత, శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్స్ బుల్లి, నిర్మల, పద్మ, ప్రభావతి, లక్ష్మీబాయి, ఆశా కార్యకర్త అలాగే ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి , పంచాయతీ సెక్రెటరీ, ఏఎన్ఎం, గ్రామంలో ఉన్న పెద్దలు హాజరయ్యారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**చింతకాని మే 7 (మహా):** ఖమ్మం జిల్లా దివ్యాంగ చిన్నారుల మిళిత విద్య సమన్వయకర్త శ్రీ యలగందుల రాజశేఖర్ , మరియు చింతకాని మండల విద్యాశాఖ అధికారి సలాది రామారావు ఆదేశాల మేరకు ఈ వేసవి కాలంలో కూడా ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని బుధవారం చింతకాని మండల పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల వివిధ రకముల శారీరక వై కల్యములు, పాక్షిక పక్షవాతం (సెరిబ్రల్ పాల్సి) వంటి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులక చింతకాని మండల ము లోఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి గాను చింతకాని మండల పరిధిలోని వివిధ గ్రామముల నుండి వివిధ రకములైన శారీరక వైకల్యములు, పాక్షిక పక్షవాతం, నడవడంలోనూ నిలబడడంలోనూ, కూర్చోవడం లోను, ఇటువంటి వివిధ రకములైన సమస్యలతో బాధపడుతున్నబాలబాలికలు వారి తల్లిదండ్రులతో హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్ జి వసంత, చింతకాని మండల,భవితా కేంద్రం లచ్చగూడెం నిర్వాహకులు కవి కొండల శ్రీనివాసకృష్ణారావు, ఐఆర్పి, భూక్యాదస్లి ఐఆర్పి , పాల్గొన్నారు.

# దేశం జోలికొస్తే సహించేది లేదు

- అవసరమైతే యుద్ధానికైనా సిద్ధమే
- బిజెపి జాతీయ నాయకులు పొంగులేటి
- ఆపరేషన్ సిందూర్ విజయం పట్ల హర్షం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు నేతృత్వంలో పూజలు
- సైన్యానికి, మోడీకి ఆశీస్సుల కోసం సాయిబాబా గుడిలో యాగం
- జన గణన, కుల గణన అంశంపై అవగాహన సదస్సు

**వైరా, మే 7 :మహా:** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో సిందూరాన్ని కోల్పోయిన ఆడపడుచుల కన్నీటి నుండి రాలిపడిన కెరటమే "ఆపరేషన్ సిందూర్" అని భారతీయ జనతా పార్టీ తమిళనాడు, కర్ణాటక సహ ఇన్‌చార్జ్, మాజీ శాసన మండలి సభ్యులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ కేంద్రంలోని కామిశెట్టి ఫంక్షన్‌హాల్‌లో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన కుల గణన, జనగణన అవగాహన సదస్సుకు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వైరా పట్టణంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేశ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నరేంద్ర మోడీతో పాటు, దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం త్యాగం చేస్తూ ఆపరేషన్ సిందూర్ లాంటి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న సైనికులకు మనోధ్యైర్యంతో పాటు, ఆశీస్సులు అందించాలని ప్రత్యేకంగా యాగం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వైరా అయ్యప్ప ఆలయంలో దేశ రక్షణ కోసం దీవెనలు అందించాలని కోరుతూ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కామిశెట్టి ఫంక్షన్‌హాల్‌లో




పార్టీ నూతన మండల అధ్యక్షుడు మనుబోలు వెంకట క్రిష్ణ అధ్యక్షతన జరిగిన జనగణన, కుల గణన అవగాహన సదస్సులో ప్రసంగించారు. దేశ పౌరుల జోలికొస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధం అనేలా ప్రధాని నరేంద్ర మోడీ చర్యలు ఉన్నాయని, ముఖ్యంగా పహల్గాం దాడి జరిగిన వారంలోనే ఆపరేషన్ సింధూర్ కార్యక్రమం నిర్వహించి, 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి దేశ సత్తా చాటారని మోడీ ప్రభుత్వంతో పాటు, భారత సైనికులను అభినందించారు. ముఖ్యంగా పహల్గాం దాడిలో హిందువులా ముస్లీంలా అని గుర్తించి మరీ హత్యాకాండను కొనసాగించిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ చెంపపెట్టులాంటిదని, అవసరమైతే ఈ విషయంలో యుద్ధానికి కూడా వెనకాడే ప్రసక్తే లేదనేది మోడీ సంకల్పంగా అభివర్ణించారు. పాకిస్తాన్‌తో పాటు ఆదేశానికి సహకరిస్తున్న చైనా, శ్రీలంక దేశాలు కూడా బుద్ధిగా ఉండాలని, లేనిపక్షంలో తీవ్ర మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత అభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్ ప్రతాప్, నున్నా రవి కుమార్, మందడపు సుబ్బారావు, అల్లిక అంజయ్య, దొడ్డా అరుణ, మణి, పమ్మి అనిత, వీరవెల్లి రాజేష్, నల్లగట్టు ప్రవీణ్, రవి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# 9న జిల్లాకు రానున్న కేటీఆర్

- భారత సైనిక చర్యపై తాతా మధుసూదన్, సండ్ర ప్రశంసలు
- రాయల శేషగిరి విగ్రహావిష్కరణకు హెలికాప్టర్‌లో కేటీఆర్
- సత్తుపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులకు సండ్ర వీరయ్య పిలుపు



**ఖమ్మం - మహా:** ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత సైన్యం చేపట్టిన వైమానిక దాడులను బిఆర్ఎస్ పార్టీ గట్టిగా స్వాగతించింది. ఈ మేరకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ , మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు బుధవారం ఖమ్మం తెలంగాణ భవన్ నందు నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ "పాకిస్తాన్ గత కొన్ని దశాబ్దాలుగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి భారత్‌కు శత్రుత్వపూరితంగా వ్యవహరిస్తోంది. దేవాలయాలపై, పార్లమెంట్‌పై, సైనిక స్థావరాలపై జరిగిన దాడులకు పాక్ ప్రేరణ స్పష్టంగా కనిపిస్తుంది. జైషే మహమ్మద్ లాంటి ఉగ్రవాద సంస్థలు మత ఘర్షణలను పెంచే ప్రయత్నాల్లో ఉన్నాయి. అలాంటి దేశాలపై చర్యలు తప్పనిసరి. భారత సైన్యం తగిన సమయంలో తగిన స్థాయిలో బదులిచ్చింది. దీనికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. ఉగ్రవాదం లేని సమాజం కోసమే బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంది" అన్నారు. అలానే, తాను తెలియజేసిన మరో ముఖ్యాంశం ఏమిటంటే ఈ నెల 9న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర యువనేత కేటీఆర్ ఖమ్మం జిల్లాకు పర్యటన చేస్తారని చెప్పారు. ఆయన రాయల శేషగిరి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. స్వల్ప అనారోగ్యం కారణంగా కేటీఆర్ హెలికాప్టర్‌లో పర్యటన చేస్తారని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించామని, రాయల శేషగిరి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే, ఇటీవల అకాల వర్షాల వల్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సీసీఐ పత్తి కొనుగోళ్ల గోలుమాలపై రాష్ట్ర నాయకత్వం వెంటనే స్పందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, మాజీ రాష్ట్ర చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, బీఆర్ఎస్ నగర, మండల అధ్యక్షులు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# 16 నెలల్లో అభివృద్ధి చేసి చూపించాం



**మహా భద్రాచలం:** గత పది సంవత్సరాలలో చేయని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 16 నెలల్లో ఆర్థిక పరిస్థితి సహకరించక పోయిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుపరచామని ప్రజలకు ఇచ్చిన హామీలను సంక్షేమ కార్యక్రమాలను ప్రతి పేదవాడికి అందే విధంగా ఇస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేసి చూపెడుతున్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం లోని వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలలో 25.5 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ప్రీ ఫ్యాబ్రికేటెడ్ భోజనశాలను, చర్ల రోడ్డులో ఒక కోటి 24 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టే అంతర్గత సిసి రోడ్లు మరియు డ్రైనేజీలు నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు గ్రంథాలయంలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రీడింగ్ రూమ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పేదవానికి ఇందిరమ్మ ప్రభుత్వ హాయం లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని, పేదవాళ్లే కావచ్చు ధనికులు కావచ్చు పది లక్షల రూపాయల వరకు పేదవాడికి జబ్బు చేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య కార్డు ద్వారా ఉచితంగా వైద్య సదుపాయం కల్పిస్తున్నామని,500 రూపాయలకే ఉచిత గ్యాస్ పథకం, వాటితోపాటు రాజీవ్ యువ వికాస కార్యక్రమం ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరుద్యోగ యువకులకు 50 వేల నుండి 4 లక్షల రూపాయలవరకు రుణసదుపాయ అందిస్తున్నామని, పేద కుటుంబాలు తృప్తిగా సన్న బియ్యం తోటే భోజనాలు చేయాలని ఉగాది పండుగ రోజున ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని, కాంగ్రెస్ ప్రభుత్వము వస్తే రైతులను రాజుని చేస్తామని వాగ్దానం చేశామని, అన్నమాట ప్రకారం 2 లక్షల రూపాయల వరకు రైతన్నలకు రుణమాఫీ చేశామని,25 లక్షల 65 వేల మందికి 687 కోట్ల రూపాయలని రైతు రుణమాఫీ చేసి సన్న వడ్లు పండించే రైతన్నలకు ఎకరానికి 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వంమే అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, ఆర్డీవో దామోదర్ రావు మరియు జిల్లా అధికారులు ఐటీడీఏ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లి శ్రీనివాసరావుకు ఐఎన్టీయూసీ మండల అధ్యక్ష పదవి

**చింతకాని, మే 7 (మహా):** చింతకాని మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడిగా రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త పిల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ నియామకాన్ని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు ఆదేశాలతో చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల కోసం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు బల్లెం శ్రీనివాసరావు, బల్లెం రాము, ముక్క ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల ఆదాయానికి గండి కొడుతున్న చోటా బడా నాయకులు

**చింతకాని మే 7 (మహా):** అక్రమం చేసేవాడే హీరో దోపిడీ చేసే వాడిదే రాజ్యం రాజ్యాధికారం అనే విధంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తమకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి అధికారులు అందరూ నా చేతిలో వారే గ్రామంలో గాని మండలంలో గాని ఎవరైనా నాకు ఎదురు వస్తే అంతే సంగతి అంటూ... చింతకాని ముదిగొండ గ్రామాల రెవిన్యూ పరిధి లో గల పట్టా భూమిలో ఇసుక అంటూ చిన్నమండవ మున్నేరు పారివాహ ప్రాంతంలో గల ఇసుకను ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా, ఆక్షన్ లేకుండా, ఎలాంటి సీనరేజీలు, టాక్సు, చెల్లించకుండా, ప్రతి ట్రాక్టర్ వద్ద నుండి వెయ్యి రూపాయలు వసూలు చేస్తూ, ప్రతిరోజు వందల ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తి ఆగడాలకు అడ్డు అదుపు లేదు ... ఇలాంటి వ్యక్తుల యొక్క ఆగడాలు పేట్రేగిపోతుంటే ఉప ముఖ్యమంత్రి గారి నియోజకవర్గంలో నివురు గప్పిన నిప్పులా అక్రమాలు దందాలు కొనసాగుతుంటే చర్యలేవి. ఈ దండాలు చేసే వ్యక్తులు ఉప ముఖ్యమంత్రి గారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారా, లేదా తమకు ఉన్నటువంటి ధన బలంతో కవరేజ్ చేసుకుంటున్నారాఅని గ్రామస్తులు అనుకుంటున్నారు

## మంచినీరు అందించడంలో ఎమ్మెల్యే విఫలం

- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్



**భద్రాద్రి కొత్తగూడెం, మే 7 (మహా):** కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడంలో స్థానిక శాసనసభ్యులు పూర్తిగా విఫలమయ్యారని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పట్టణంలోని మున్సిపల్ పరిధిలో గత వారం రోజులుగా కిన్నెరసాని మంచినీరు రాక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదని అధికారులకు సమస్య పరిష్కరించాలనే ఆలోచన చేయకపోవడం చాలా దౌర్భాగ్యం అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని,మంచి నీటి సమస్యను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని, నెల, రెండు నెలలకు ఒకసారి రోజుల తరబడి కిన్నెరసాని మంచినీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలనే చిత్తశుద్ధి లేకపోవడం చాలా దౌర్భాగ్యకరమన్నారు. పట్టణంలో సరఫరా అవుతున్న కిన్నెరసాని మంచినీరుతో పాటు సింగరేణి సంస్థ ద్వారా బస్తీల్లో వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి స్వచ్ఛమైన మంచినీటిని నిర్దిష్ట సమయంలో ప్రతీ రోజు అందించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం



**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమై మంగళ తోరణం కట్టడం జెండా ఊరేగింపు, ఆవిష్కరణ, శ్రీ గోవిందమాంబా సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారికి నవనీత అభిషేకములు ,అలంకరణలు ,మహా నివేదన ,మహా మంత్రపుష్పం ,మంగళ నీరాజనం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. టేకులపల్లి బ్రాహ్మణ గారి దేవాలయ కమిటీ మధ్యాహ్నం 12:30 గంటలకు నుండి అన్నదాన మహోత్సవం నిర్వహించారు.



## కుటుంబ ఆభివృద్ధికి మహిళలే కీలకం

**కారేపల్లి, మహా:** కుటుంబ అభివృద్ధికి మహిళలే కీలకమని మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్ లు అన్నారు. బుధవారం కారేపల్లి మండలం రావోజీతండాలో మా ఇంటి మణిదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడ బిడ్డ పుట్టిన తల్లిదండ్రులు సన్మానించి సర్టిఫికెట్, మిఠాయి అందజేశారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేడు మహిళలు అన్నిరంగాల్లో దూసుకపోతున్నారన్నారు. ఉగ్రవాదులపై నిర్వహిస్తున్న ఆపరేషన్ సింధూర్ లో యువతులు ముఖ్య భూమికి పోషించటం అభినందనీయమన్నారు. ఆడపిల్ల తల్లిదండ్రులు వివక్షత లేకుండా పిల్లలను సమాన దృష్టితో చూడాలని కోరారు. ఎంపీఈ రవీంద్ర ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్వైజర్ దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎం,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతిభ చూపిన ఎల్ఐసీ ఏజెంట్‌కు సన్మానం



**కారేపల్లి, మహా:** భీమా రంగంలో కారేపల్లికి చెందిన ఇందుర్తి సురేందర్‌రెడ్డి ప్రతిష్టాత్మక ఎండీఆర్‌టీ అవార్డు దక్కించుకున్నారు. ఏజెంట్‌గా ప్రభుత్వ రంగ సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ అధికంగా పాలసీలను చేసి ఆరోవసారి ఎండీఆర్‌టీగా ఎంపికైనాడు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ఏజెంట్ల తో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎం.డి.ఆర్.టి) సమావేశానికి కొత్తగూడెం బ్రాంచ్ నుండి గత ఆరు సంవత్సరాలుగా అర్హత సాధించిన సందర్భంగా ఎల్ఐసీ వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో బుధవారంఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేందర్‌రెడ్డిని వరంగల్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్లు కె.సుధాకర్‌బాబు, ఎం.సుబ్రహ్మణ్యన్, మార్కెటింగ్ మేనేజర్ ఎన్.గోపాలకఅష్ణ లు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

## వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ అవార్డు పొందిన భువన్ రిభు



**ఖమ్మం - మహా:** జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అనే దేశవ్యాప్త నెట్వర్క్ స్థాపించి బాలల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్న భువన్ రిభు ని వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ గుర్తించి మెడల్ ఆఫ్ హానర్ అవార్డుతో సత్కరించిందని జస్ట్ రైట్స్ చిల్డ్రన్ నెట్వర్క్ లో భాగస్వామి అయిన యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్(ఎయిడ్) డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరి ప్రసాద్ రావు తెలియజేశార . వరల్డ్ జ్యూరిస్ట్ అసోసియేషన్ ద్వారా సత్కరించబడిన తొలి భారతీయ న్యాయవాది బాలల హక్కుల ఉద్యమకర్త భువన్ రివ్యూ అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ విధంగా ఖమ్మం జిల్లా పిల్లల రక్షణలో ఆయన దగ్గర సంబంధం కలిగి ఉన్నట్లు భావిస్తున్నట్లు తెలిపారు ఖమ్మం జిల్లాలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామిగా ఉన్న యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా గత మూడు సంవత్సరాలుగా బాల్యవివాహాలు బాలల అక్రమ రవాణాను నిరోధించడానికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరిప్రసాదరావు కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ వి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు



**ఖమ్మం, మే 7 , మహా:** నగరంలోని ట్రాఫిక్ సమస్యలకు స్థిరమైన పరిష్కారం కల్పించేందుకు మున్సిపల్ కమిషనర్ బుధవారం ఇంజనీరింగ్ , టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి విస్తృతంగా రహదారుల పరిస్థితిని పరిశీలించారు. ప్రత్యేకంగా రైల్వే స్టేషన్ రోడ్, కస్బా బజార్ రోడ్, మున్సిపల్ కార్యాలయం నుండి రైల్వే స్టేషన్ వరకు వెళ్లే ప్రధాన రహదారులపై స్థల పరిశీలన చేపట్టారు. సందర్శన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో రహదారి వెడల్పు తక్కువగా ఉండటం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ జాం జరుగుతోందని, దీనివల్ల వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు, వ్యాపార వర్గాలు కమిషనర్ గారికి వివరించారు. ప్రజల అభ్యర్థనలతోపాటు భవిష్యత్తు అవసరాలనూ పరిగణలోకి తీసుకున్న కమిషనర్ గారు, వీలైనంత మేర రహదారులను విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు, ట్రాఫిక్‌కు అడ్డుగా మారుతున్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఇంజనీరింగ్ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. అవసరమైతే ఆక్రమణల తొలగింపు, రహదారి విస్తరణ పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర డ్రైనేజీ వ్యవస్థపై కూడా కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. వరద నీరు జారిపోయే మార్గాలను పరిశీలించి, ఇప్పటికే ఉన్న కాలువలను శుభ్రం చేయడంతో పాటు, అవసరమైతే కొత్త కాలువల నిర్మాణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ స్థల పరిశీలనలో టౌన్ ప్లానింగ్ విభాగాధిపతులు, మున్సిపల్ ఇంజనీర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ సూచనలతో అధికారులు వెంటనే చర్యలు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**దమ్మపేట ,మే7 -మహా:** మండలంలోని మారప్పగూడెం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల యూనివర్సిటీ శాస్త్రవేత్తలు బుధవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా రైతులు ఎటువంటి భూముల లో ఏఏ రకాల పంటలు సాగు చేయాలి....? రసాయన ఎరువులు లేకుండా సేంద్రియ ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలు వంటి రైతు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. స్థానిక వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట వారి ఆధ్వర్యంలో మారెప్పగూడెం లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డాక్టర్ జె. హేమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా రసాయన ఎరువులను సమతుల్యంగా వాడాలి అన్నారు. యూరియాను అదేవిధంగా రసాయనాలను తగిన మోతాదులో వాడటం వలన సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక నికర లాభాలు పొందవచ్చు అన్నారు. రైతులు పంటల సాగులో పాటించవలసిన శాస్త్రీయ మెలకువలు గురించి వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు, డాక్టర్ కే. రవికుమార్ మాట్లాడుతూ విత్తనాలు మరియు రసాయనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా రసీదులను భద్రపరచుకొని, ఏదైనా సమస్యలు వచ్చినట్టయితే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలియపరిచారు. అదేవిధంగా సాగునీరు వినియోగంలో పాటించాల్సినటువంటి శాస్త్రీయ మెలకువలను రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాంప్రసాద్ భూసార పరీక్షలకు మట్టి నమూనాను ఏ విధంగా సేకరించాలి, ఏ పోషకాలను పంటలకు ఏం మోతాదులో ఏ విధంగా వాడాలి తెలిపారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు చెట్ల పెంపకం యొక్క ఆవశ్యకతను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి వలన కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. మండలం ఉద్యాన అధికారి సందీప్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో పాటించాల్సినటువంటి మెలకువలు, పంట అవశేషాలను భూమిలో కలియ పెట్టుకోవడం వల్ల కలిగేటువంటి ప్రయోజనాలను గురించి రైతులకు వివరించారు. అనంతరం చీపురుగూడెం ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ సుబ్బారావు మాట్లాడుతూ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అని కార్యక్రమాన్ని చేపట్టి శాస్త్రవేత్తలను రైతులకు మరింత చేరువ చేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్, అను బాబు, కేశవరావు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తో పాటు, మారప్పగూడెం మరియు చీపురుగూడెం రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదర్శవంతంగా రఘునాథపాలెం తీర్చిదిద్దుతాం



**ఖమ్మం, మే -07, మహా:** ఆదర్శవంతంగా రఘునాథ పాలెం మండలం తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండల కేంద్రంలో పర్యటించి 30 లక్షలతో చేపట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనం మౌళిక సదుపాయ, కాంపౌండ్ గోడ నిర్మాణ పనులకు, ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి. ఎస్. నిధులు రెండు కోట్ల 33 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, సి.ఆర్.ఆర్. నిధులు ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో రఘునాథపాలెం రైస్ మిల్ నుండి ఖమ్మం ఇల్లందు రోడ్డు వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, సి.ఆర్.ఆర్. (ఎస్.సి.పి.) నిధులు ఒక కోటి 10 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రోడ్లపై నీరు రాకుండా చూసుకోవడం, రోడ్లపై ఆక్రమణలు జరగకుండా చూడాలని అన్నారు. ప్రజలు ఒప్పుకుంటే మెయిన్ రోడ్ విస్తరణకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మంచి రోడ్లు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, నాగపూర్ నుంచి అమరావతికు జాతీయ రహదారి వస్తుందని, భూములు కోల్పోయే రైతులకు ముందు 15 లక్షలు ఎకరానికి ఇస్తామని చెబితే, తాను కొట్లాడి 35 లక్షలు ఇప్పించానని మంత్రి అన్నారు. ఖమ్మం నగరానికి చుట్టు రింగ్ రోడ్డు వస్తుందని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు దేశంలో ఎక్కడా ఎకరానికి 35 లక్షలు ఇచ్చిన దాఖలాలు లేవని, కేంద్ర ప్రభుత్వంతో తాను కొట్లాడి ఇప్పించానని, ఇదే జాతీయ రహదారికి ఆంధ్రప్రదేశ్ లో భూసేకరణ పరిహారం క్రింద 13 లక్షలు మాత్రమే వచ్చాయని తెలిపారు. రఘునాథపాలెం లోనే 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం, వైద్య కళాశాల నిర్మిస్తున్నామని అన్నారు. విద్యతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహిస్తూ యంగ్ ఇండియా విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రఘునాథ పాలెంలో స్టేడియం, ప్రపంచంలో 130 దేశాలలో విద్యాసంస్థలు నడిపే స్వామి నారాయణ సంస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా గిరిజనులకు ఉచితంగా విద్య అందుతుందని అన్నారు. కుటుంబంలో ఒకరు బాగా చదువుకుంటే పేదరికం దూరం అవుతుందని అన్నారు. మండలంలోని 36 చెరువులకు సమృద్ధిగా జూలై వరకు నీరు విడుదల అవుతుందని, అవసరమైన పైప్ లైన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. నీటి సమస్య ఇకపై ఉండదని రైతులు లాభసాటి పంటల ఆయిల్ పామ్ సాగు చేయాలని, అంతర్ పంటలు సాగు ద్వారా ఆదాయం లభిస్తుందని, ప్రతి ఎకరానికి 51 వేల రూపాయల వరకు సబ్సిడీ కల్పించి డ్రిప్ సౌకర్యం మొక్కలు అందిస్తామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, పేదలకు సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, 2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. బుగ్గ వాగు దగ్గర కాలువ పనులు ఆలస్యం అవుతున్నాయని లిఫ్ట్ పనులు చేపట్టామని, త్వరలో కాలువ పనులు కూడా పూర్తి చేస్తామని అన్నారు. వర్షాలు ఉన్నప్పుడు గ్రావిటీ ద్వారా, లేని పక్షంలో లిఫ్ట్ ద్వారా ప్రజలకు తప్పనిసరిగా నీరు అందిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలను వినియోగించుకుంటూ సమాజంలో మనం నిలబడాలని, ప్రతిదానికి ప్రభుత్వం సహాయం చేయాలంటే కుదరదని, మనం కట్టే పన్నులు మాత్రమే మనకు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అనంతరం మత్స్యకార మహిళా సహకార సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసారు. అంతకుముందు మంత్రి, వైద్య కళాశాల నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి శంకుస్థాపన పనుల ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బాలాపేట-బల్లెపల్లి వద్ద జరుగుతున్న కాల్వ పనులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి లో శ్రీ కోట మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో గురువారం దుకాణాల సముదాయం కొబ్బరి చిప్పలు ప్రోగు చేయడం కు సంబంధించి బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి వేణుగోపాలచార్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం వారు మాట్లాడుతూ దుకాణాల సముదాయము టెంటు సామాన్లు సప్లై చేయుట కొబ్బరి చిప్పలు పో గు చేయుట వేలం ఆసక్తి కలవారు డిపాజిట్ చెల్లించి పాటలు పాల్గొనాలని కోరారు. వేలం పాటలు కేవలం ఒక సంవత్సరం కాలానికి మాత్రమే పరిమితి ఉంటుందన్నారు. ఈ వేలంపాట సహాయ కమీషనర్, దేవాదాయశాఖ, హైద్రాబాద్ వారి ఉత్తర్వులకు లోబడి యుండును. ఈ వేలంపాటలో పాల్గొనువారు పై తెలిపిన డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని దేవస్థానమునకు బకాయి ఉన్నవారు కాని, దేవస్థానము సొమ్ము చెల్లింపులో జాప్యము చేసినవారు దేవాదాయశాఖ ఉద్యోగస్తులు మైనర్లు బహిరంగవేలంలో పాల్గొనుటకు అనర్హులు. అని తెలిపారు హెచ్చుపాటదారుడు డిపాజిట్ తో సంబంధం లేకుండా హెచ్చుపాట మొత్తంలో సగం డబ్బులు, పాట ముగిసిన వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు ఈ అవకాశాన్ని సద్వినియోగం భక్తులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వాసవి తల్లి జన్మదినోత్సవ భజనోత్సవం





**ఖమ్మం టౌన్ - మహా:** శాంతి, సత్యం, అహింసకు ప్రతీకగా భక్తహృదయాలలో వెలుగొందుతున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం నగరం ఆధ్యాత్మిక మంగళగానాలతో మార్మోగిపోయింది. వైశ్య సమాజం గొప్ప సంప్రదాయాలకు ప్రతిరూపంగా, నగరంలోని వాసవి దేవాలయంలో నిర్వహించిన భజన కార్యక్రమం కనుల పండుగగా మారింది. ప్రత్యేకంగా ఆహ్వానించబడిన భజన బృందం ఆలయంలో ఘనంగా సాగించిన సంకీర్తన సుధలు, ఆలయ వాతావరణాన్ని ఏకాంతమైన భక్తిరస సముద్రంగా మార్చాయి. విశేష భక్తజనం అమ్మవారి ఆశీస్సులు కోసం తరలివచ్చి, తల్లికి మంగళార్పణ చేశారు. ఖమ్మం నగరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం నిన్న ఆదివారం ప్రత్యేక భజనోత్సవానికి వేదికగా నిలిచింది. వైశ్యుల కులదైవమైన అమ్మవారి జన్మదినం సందర్భంగా, వేదఘోషల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం భజన కార్యక్రమం శ్రద్ధా శాంతులతో ప్రారంభమైంది. అనేక గ్రామాల నుంచి విచ్చేసిన భజన బృందం, తల్లిని స్తుతిస్తూ గానం చేసిన సంకీర్తనల ధ్వని ఆలయ ప్రాంగణాన్ని ఆలౌకిక రసరంజితంగా మార్చింది. ఈ పుణ్యఘడియల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కుటుంబసమేతంగా విచ్చేసి అమ్మవారి భజన కార్యక్రమంలో పాలుపంచు కున్నారు. హారతులు, దీపారాధనలు, పుష్పాంజలి వంటి కార్యక్రమాలతో అమ్మవారికి అర్చనలు చేసి, ఆమె అనుగ్రహాన్ని పొందాలని ప్రార్థించారు. ఇలాంటి భక్తి కార్యక్రమాలు మరింత విస్తరించి, సాంప్రదాయాలకు నూతన ఊపిరి కలిగించేలా అందరూ కలిసి పునరుజ్జీవనం చేయాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.



# వైద్య విద్యార్ధులకు మహర్దశ

- 35 ఎకరాలు ,166 కోట్లు తో భవనాల నిర్మాణం
- కార్పొరేట్ తరహా హంగులతో కొత్త భవనాలు
- నేడు మెడికల్ కళాశాలకు భవనాలకు శంకుస్థాపన
- వేడుకలో పాల్గొననున్న అమాత్యులు
- భట్టి, తుమ్మల, రాజనర్సింహా, పొంగులేటి

**ఖమ్మం - మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్య విద్యకు మహర్దశ పట్టనుంది. ఖమ్మం మెడికల్ కళాశాలకు అత్యాధునిక హంగుల తో కార్పొరేట్ తరహాలో కొత్త భవనాలకు గురువారం అమాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా భూమి పూజ మహోత్సవం నిర్వహించనున్నారు పాల్గొననున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి . జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానంగా నిర్వహించనున్న మెడికల్ కళాశాల ప్రస్తుతం చాలీచాలని భవనాలలో తరగతులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం మెడికల్ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రఘునాథపాలెం మండలం బల్లేపల్లి శివారులో 35.03 ఎకరాలలో 166 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల నూతన భవనాలను మంత్రి తుమ్మల మంజూరు చేయించారు. ఈ నూతన శంకుస్థాపన వేడుకలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు మరియు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు. ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి అనుసంధానంగా ఉన్న ఖమ్మం మెడికల్ కళాశాల మెడికల్ కళాశాల నిర్మాణం అద్భుతంగా అత్యాధునికంగా ఉండాలని మంత్రి తుమ్మల సంకల్పం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని వసతులతో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు చేశారు. కార్పొరేట్ వైద్య కళాశాలలను తలదన్నేలా నిర్మాణం చేపట్టేందుకు మంత్రి తుమ్మల కంకణం కట్టుకున్నారు. పనులు శరవేగంగా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం ఏర్పాటు, ఇతర అవకాశాలకు అనుగుణంగా దీనిని అత్యాధునిక వసతులతో రూపకల్పన చేశారు. ఎడికల్ విద్య శ్రీమంతులకు మాత్రమే అవకాశం ఉండేది. కానీ ఖమ్మంలో ప్రభుత్వం ఆసుపత్రికి అనుసంధానంగా ఉన్న వైద్య కళాశాల ప్రతిభ గల పేద విద్యార్థులకు వరంగా మారింది. అత్యాధునిక సౌకర్యాలతో అత్యుత్తమ అధ్యాపకులతో కార్పొరేట్ కు దీటుగా నిర్మించేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. అభివృద్ధి అనే మంత్రాన్ని మంత్రి పదవితో ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ఆవిశ్రాంతంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి మంత్రి తుమ్మల కృషి చేస్తున్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు,ఏజెన్సీ గిరిజనులకు వైద్య మరింత చేరువ చేసేలా చర్యలు చేపడుతున్నారు.



# కాంగ్రెస్‌తోనే పేదవారి సొంతింటి కల సాధ్యం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**మణుగూరు, మహా:** పేదింటి వారి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పినపాక మండలం గొట్టెల్ల గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందని రాష్ట్రంలో అమలుపరిచే సంక్షేమ పథకాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పించిందని పినపాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మొదటి విడతగా అందించామని అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలియజేశారు. అనంతరం లబ్ధిదారి ఇర్ప లక్ష్మికి నూతన వస్త్రాలను అందజేసే శు భాకాంక్షలు తెలియచేసారు.మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ,పినపాక ఎమ్మార్వో అద్దంకి నరేష్, ఎంపీడీవో సునీల్ కుమార్, ప్రభుత్వ అధికారులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోడిశాల రామనాధం, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కరకగూడెం మండల నాయకులు,మహిళ నాయకులు, యువజన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మన్యం వీరుడు అల్లూరికి ఎమ్మెల్యే ఘన నివాళి



**మణుగూరు, మహా:** మణుగూరు అంబేద్కర్ సెంటర్ పెట్రోల్ బంక్ ఎదురుగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు గారి 101వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కాశ్మీర్ పహల్గం లో ఉగ్రవాది దాడిలో మృతి చెందిన భారతీయుల కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి శౌర్య ప్రతాపాలను ఎమ్మెల్యే కొనియాడారు. స్వాతంత్ర్య భారత సంగ్రామంలో శివాజీ తరువాత అంతటి పోరాట పటిమ కనపరచిన మహావీరుడు అల్లూరి సీతారామ రాజు అని దేశ స్వతంత్రం కొరకు తన ప్రాణాలను అర్పించిన గొప్ప నాయకుడని అల్లూరి చరిత్ర రానున్న తరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోల్లోజు అయోధ్య , మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినకి నవీన్, సిపిఐ, సిపిఎం,టిడిపి నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, క్షత్రియ సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వాసవిమాత జన్మదినోత్సవ వేడుకలలో ఆర్యవైశ్యుల ప్రత్యేక పూజలు



**దమ్మపేట ,మే7-మహా:** మండల కేంద్రంలో ని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి యున్న ఆర్యవైశ్యుల కుల దైవం వాసవీ అమ్మవారి జయంతి ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా వేకువజాము నుండే వాసవీ మాతకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేద మంత్రోశ్చరణతో అమ్మవారికి పూజలు గావించారు. ఆర్యవైశ్య కన్య లచే కుంకుమ పూజలు ,ప్రత్యేక ఆరాధనలు చేశారు. పట్టణంలో ఉన్న అన్ని వర్తక వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. యువకులు బైక్ లపై జై వాసవి అంటూ పట్టణంలో ర్యాలీ జరిపి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య పెద్దలు తమ కుల దైవమైనటువంటి వాసవీ అమ్మ వారి చరిత్ర గురించి నేటి తరం యువతకు తెలిపారు. దమ్మపేట మందలపల్లి మధ్యలో గల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో వెంచ్చేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ,వాసవి క్లబ్ ఆధ్వర్యంలోవాసవి జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా పుష్పాలతో అలంకరించారు .ఉదయం 6 గంటలకు కలశ స్థాపన, వాసవి మాతకు పంచామృత అభిషేకాలు ,నూతన వస్త్రాలంకరణ ,అనంతరం చిన్నారులచే కన్యక పూజలు నిర్వహించారు. తదనంతరం పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్యుల విద్యార్థుల ను సన్మానించారు .అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ దారా మల్లిఖార్జున రావు , ఆర్యవైశ్య సంఘం జిల్లా వర్కింగ్ ప్రెశిడెంట్ దారా యుగంధర్ , పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దారా ప్రసాద్, వాసవి క్లబ్ అధ్యక్షులు మండవల్లి సురేష్,వెంకటేశ్వరవు, అత్తులూరి పోసి, పసుమర్తి రామభద్రం, మాడా లక్ష్మీనారాయణ, ప్రదీప్, వినోద్, అడపా సాయి,సాయిరాం, ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.